క్లుప్తంగా

26 నుంచి వారాహి నవరాత్రులు

తగరపువలస: భీమిలి మండలం రేఖవాని పాలెం పంచాయతీ కీతినేపేట శ్రీవిద్యా శక్తిపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 5 వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. ఈ సందర్భంగా విశేష అర్చనలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నవరాత్రుల ప్రారంభం నుంచి వారాహి అమ్మవారి మాలధారణలు ప్రారంభమై చివరి రోజు దీక్షా విరమణ, మహా పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. ఈ నవరాత్రుల పూజల్లో పాల్గొనాలనుకునేవారు 89783 73743, 83283 05636 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆంజనేయులు

పద్మనాభం: బీచ్ రోడ్డులో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ జీ.వీ.ఆంజనేయులు కోరారు. మండల పరిషత్ కార్యాలయ భవన్‌లో గురువారం రాత్రి యోగాంధ్రపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాంధ్రకు అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాంధ్రకు వచ్చే వారి కోసం బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కె.శ్రీధర్, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



పారంభ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఈ శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా పేద మహిళలు స్వయం ఉపాధి పొందడం కోసం ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఇది 11వ శిబిరమని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఇప్పటివరకు 50 మంది శిక్షణ కోసం చేరారని, ఆసక్తి గలవారు 964322 2666 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమ ఇన్‌చార్జి పావని, ట్రైనర్ సుభాని, ఫౌండేషన్ సభ్యులు శ్రీను, లక్ష్మణరావు, కృష్ణ, నర్సింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు


తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల పాఠశాలలకు చెందిన వందమందికి పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. యోగాసనాలు వేయడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ విద్యార్థులు చక్కని చిత్రాలు గీశారు. విజేతలకు యోగా దినోత్సవం రోజు నిర్వాహకులు బహుమతులు ఇవ్వనున్నారు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభంతో అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు టీచర్స్ కాలనీలో రోడ్డు మధ్య విద్యుత్ స్తంభంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేటప్పుడు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం తరచూ ప్రమాదాలకు కారణమవుతోంది. అధికారులు స్పందించి, ఈ స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభం



ఆహ్లాదకర వాతావరణం.. చుట్టూ పరచుకున్న పచ్చదనం.. విశాలమైన ప్రాంగణంలో సాధకులకు స్వాగతం పలుకుతోంది భీమిలిలోని అంతర్జాతీయ యోగా పరిశోధన కేంద్రం. ఏకాగ్రతతో శిక్షణ పొందేందుకు అనువైన అన్ని వసతులు కలిగి ఉంది. రెసిడెన్షియల్ సదుపాయం ఉన్న ఈ యోగా శిక్షణ కేంద్రంలో ఏటా 3 వేల మందికి పైగా శిక్షణ పొందుతున్నారు.

చైతన్య దీపిక యోగా వేదిక..

ఆరోగ్యానికి చిరునామాగా యోగా కేంద్రం • ప్రశాంత వాతావరణంలో శిక్షణ

చక్కని వసతి సదుపాయం • ఏటా 3 వేలమంది యోగాభ్యాసం



శిక్షణ పొందడానికి వచ్చేవారు ఉండేందుకు వసతి భవనం



కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

భీమునిపట్నం: అంతర్జాతీయ యోగా పరిశోధన కేంద్రం ద్వారా ఏటా వేలాది మంది యోగాలో శిక్షణ పొందుతున్నారు. విజయనగరంలో ఉన్న కేంద్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

2005లో ప్రారంభం

భీమిలిలో 2000 సంవత్సరంలో ఈ యోగా కేంద్రానికి శ్రీకారం చుట్టారు. 1990లో విజయనగరం జిల్లా విజినిగిరిలో యోగా గురువు రాపర్తి రామారావు యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఇక్కడ ఉన్న వారందరికీ ప్రధాన యోగా గురువు. ఆయన వద్ద విశాఖకు చెందిన డాక్టర్ సదాశివరావు శిష్యుడిగా ఉండేవారు, ఆయన విశాఖకు దగ్గర్లో ఒక యోగా కేంద్రం ఉంటే బాగుంటుందని భావించారు. వెంటనే భీమిలి కృష్ణాకాలనీ సమీపంలో తన అయిదు ఎకరాల భూమిని ఉచితంగా దీనికోసం అందించారు. తద్వారా 2000లో నిర్మాణ పనులు మొదలుకాగా, 2005లో ఈ యోగా కేంద్రం ప్రారంభమైంది. యోగా కేంద్ర ఉపాధ్యక్షుడు, యోగా గురువు సీహెచ్. వెంకటరావు పర్యవేక్షణలో కేంద్రం నిర్వహణ జరుగుతోంది. తొలుత ఇక్కడి పరిసరాల్లో ఉండేవారికి ఇందులో శిక్షణ ఇచ్చేవారు. తర్వాత 2007 నుంచి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇక్కడే ఉండి శిక్షణ పొందే విధంగా రెసిడెన్షియల్ విధానాన్ని ప్రారంభించారు.

యోగా, ధ్యానంలో ఉచిత శిక్షణ

ఇక్కడ ఉచిత శిక్షణ తరగతులను తరచూ నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులతో పాటు ఇతర సెలవు దినాల్లో, కొన్ని సాధారణ రోజుల్లో కూడా పిల్లలకు యోగా, ధ్యానంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ అందిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా చాలామంది వచ్చి శిక్షణ పొందుతున్నారు.

గోశాల.. పతంజలి వనం

కేంద్రం ప్రాంగణంలో గోశాల ఉంది. సుమారు 15 దేశవాళీ గోవులు ఉన్నాయి. వీటిని సంరక్షిస్తూ, వాటి పాలను ఇక్కడ ఉండేవారితో పాటు శిక్షణకు వచ్చేవారికి వినియోగిస్తున్నారు.

- కేంద్రం ప్రాంగణంలో ఫలాలను ఇచ్చే పలు రకాలైన చెట్లతో పాటు పతంజలి వనం పేరుతో ఔషధ గుణాలున్న మొక్కలను పెంచుతున్నారు. వీటికి ఎటువంటి రసాయన ఎరువులను వినియోగించకుండా పెంచుతున్నారు. దీంతో స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ పొందుతూ ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటున్నారు ఆరోగ్యాభిలాషులు.



దేశ, విదేశాల నుంచి శిక్షణకు..

ఇక్కడ వందమంది ఉండడానికి అన్ని వసతులతో కూడిన గదులు ఉన్నాయి. 15 రోజులపాటు యోగా, ధ్యానంపై శిక్షణ ఇస్తారు. అలాగే, యోగా టీచర్ కోర్సులు చేయాలనుకునే వారి కోసం మూడు నెలల కోర్సు ఉంటుంది. ఇక్కడ ఆయా కోర్సుల కోసం ఆంధ్ర, తెలంగాణ నుంచి, ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి శిక్షణకు వస్తుంటారు. అలాగే అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ దేశాల నుంచి కూడా పలువురు శిక్షణ పొందడానికి వస్తుంటారు. ముఖ్యంగా ఇక్కడకు శిక్షణ అందించే కోర్సులకు తక్కువ రుసుములు ఉంటాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో రెసిడెన్షియల్ సదుపాయం ఉన్న యోగా కేంద్రం ఇక్కడ మాత్రమే ఉంది. ప్రస్తుతం 50 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఏటా 3వేల మందికి పైగా శిక్షణకు వస్తుంటారని నిర్వాహకులు తెలిపారు.



ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పతంజలి వనం



గోశాల వద్ద ఆవులు

ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ



ఇక్కడ యోగా శిక్షకులు ప్రత్యేక శ్రద్ధతో ఆసనాలను నేర్పిస్తున్నారు. యోగా క్రియలు, ధ్యానం కూడా నేర్పుతున్నారు. ఇక్కడి ప్రశాంత వాతావరణంలో ఏకాగ్రతతో వీటిని అభ్యసిస్తున్నాం.

– సత్యనారాయణ, భీమవరం

ఆహారం.. వసతి బాగున్నాయి



ఇక్కడ కొద్ది రోజులు ఉండి శిక్షణ పొందడానికి వసతి సదుపాయం ఉండటం మాలాంటి వారికి వరం. నిర్దేశించిన సమయంలో చక్కని సాత్విక ఆహారం అందిస్తున్నారు. పద్ధతి ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంతో బాగుంది.

– జి.రేణుక జ్యోతి, హైదరాబాద్

అద్భుతమైన అనుభూతి



విశాలమైన ప్రాంగణంలో విస్తారంగా ఉన్న చెట్లు, మొక్కలతో ఇక్కడ చాలా ప్రశాంతంగా ఉంది. ఇలాంటి వాతావరణంలో యోగాను అభ్యసించడం అద్భుతమైన అనుభూతిని అందిస్తోంది. ఇక్కడికి రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా.

– ఎం.నాగమణి, విశ్రాంత నేవీ సూపరింటెండెంట్, విశాఖపట్నం

గురుదేవుల ఆశయాలకనుగుణంగా..



మా అందరికీ ప్రధాన గురువు, దైవ సమానులు రాపర్తి రామారావు. ఆయన ఆశయాలు, విధానాలను అనుసరించి ఇక్కడి యోగా కేంద్రం నిర్వహణ జరుగుతోంది. ప్రత్యేక శ్రద్ధతో ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికీ శిక్షణ అందిస్తున్నాం. ఇది వారికి ఎంతో చక్కని అవకాశం.

– సీహెచ్.వెంకటరావు, యోగా గురువు, కేంద్రం నిర్వాహకులు

యోగా దినోత్సవానికి విస్తృతంగా ఏర్పాట్లు



బీచ్‌రోడ్డులోని మార్లిన్‌కే రెస్టారెంట్ ఎదురుగా వాహనాల పార్కింగ్ ప్రదేశం



బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



డబుల్ రోడ్డు ముగిసే ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఆఖరి వేదిక

భీమునిపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి భీమిలి బీచ్‌రోడ్డులో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ నుంచి బీచ్ రోడ్డులో ఒకవైపు కార్యక్రమ నిర్వహణకు కేటాయించారు. ఇక్కడ నిర్దేశించిన చోట్ల చిన్న వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల వద్ద ఎవరికి కేటాయిస్తారో వారు కార్యక్రమంలో పాల్గొనవలసి ఉంటుంది. ఇక్కడ ఉమర్ అలీషా ఆశ్రమం వరకు ఉన్న డబుల్ రోడ్డు ముగిసే చోట ఆఖరి వేదిక ఏర్పాటు జరుగుతోంది. అక్కడి వరకు అందరూ కార్యక్రమంలో పాల్గొంటారు. మార్లిన్‌కే రెస్టారెంట్ ఎదురుగా భీమిలి కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి చెందిన విశాలమైన స్థలం ఉండడంతో అక్కడ వాహనాలను నిలపడానికి పార్కింగ్ కింద కేటాయించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల నుంచి పోలీసులు ఇక్కడికి చేరుకుంటున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యార్థుల యోగాభ్యాసం



రఘు ఇంజినీరింగ్ కాలేజీలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. కళాశాల విద్యార్థులతో యోగా శిక్షకుడు జీకే నాయుడు గురువారం యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 21న జరగనున్న యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఆనందపురం జెడ్పీ హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

- ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థులు ఆటస్థలంలో యోగాసనాలు వేశారు.
- భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో యోగా గురువు కె.శ్రీనివాసరావు యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రోగ్రాం కో– ఆర్డినేటర్లు బి.ఎస్. వెంకటరెడ్డి, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్య 'యోగం'



యోగాసనాలు వేస్తున్న దేవస్థానం సిబ్బంది, ఉద్యోగులు

కొమ్మాది: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాను మించిన సాధన మరొకటి లేదని యోగా గురువు సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి దేవస్థానం సిబ్బంది, ఉద్యోగులు, శ్రీవారి భక్తులతో టీటీడీ కల్యాణ మండపంలో ఆయన యోగాసనాలు వేయించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్, ధారిక ప్రచార మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పాల్గొన్నారు.

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



మధురవాడలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోనుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నారు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా కొమ్మాది జంక్షన్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై కక్ష గట్టి అంచెలంచెలుగా ఉద్యోగాల నుంచి తొలగించే కుట్రకు పూనుకున్నారని చెప్పారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం లేదని ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోదీ చేత కూటమి ప్రభుత్వం ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పేడాడ రాజ్‌కుమార్, టి.తిరుపతి, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లేదెలా?



ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ప్రధాన ద్వారానికి అడ్డంగా చిరు దుకాణాలు

తగరపువలస: ఆనందపురం జెడ్పీహైస్కూల్ ప్రధాన ద్వారం దాటి లోపలికి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లాలంటే అక్కడి చిరు వ్యాపారులతో పెద్ద యుద్ధమే చేయవలసి ఉంటుంది. మూసిన గేటు తెరవనీయకుండా, దానిని ఆనుకుని వ్యాపారులు అడ్డంగా ఉండిపోతారు. దీంతో లోపలికి, బయటకు వెళ్లే ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు అక్కడి వ్యాపారులను పక్కకు పంపించి గేటు దాటాలంటే తల ప్రాణం తోకకు వస్తోంది. పాఠశాల పని దినాలలో గేటు తెరవడానికి వీలుగా వ్యాపారులను దూరంగా ఉండమని ఉపాధ్యాయులు చెబుతున్నా వారిపై దాడులకు దిగుతుండటంతో ఏమీ చేయలేక పోతున్నారు. విద్యాశాఖ, పోలీసులు జోక్యం చేసుకుని పాఠశాలలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

వికసిత భారత్ సాధనకు సమైక్యంగా నడుద్దాం

తగరపువలస: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో వికసిత భారత్ సాధనకు అంతా కలిసి నడుద్దామని రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. చిట్టివలసలో గురువారం జరిగిన వికసిత భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద కుటుంబంలో జన్మించిన ప్రధాని, ప్రపంచంలోనే అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, మేడపాటి రవీంద్ర, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

కొమ్మాది: గీతం క్రికెట్ మైదానంలో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర సంచాలకుడు, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ నుంచి దాదాపు 10 వేల మంది ఇక్కడ పాల్గొంటారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సిరి సహస్ర పుట్టినరోజు వేడుకలు



ఆనందపురంలో సిరి సహస్రను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర పుట్టినరోజు వేడుకలు ఆనందపురంలోని ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల నడుమ ఆమె భారీ కేక్ కట్ చేశారు. ఆమెను సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. వేడుకలలో కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, మజ్జి శారదా ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, బంక సత్యం, బోని బంగారునాయుడు, మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జీవీఎంసీ వార్డు అధ్యక్షుడు పాల్గొన్నారు.

- పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సిరి సహస్ర కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెం యూపీ స్కూల్ అప్‌గ్రేడ్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్పు



హెచ్‌ఎం నారాయణరావు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం ఇక్కడ 160మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో ఈ పాఠశాలకు పూర్తి స్థాయి గెజిటెడ్ హెచ్‌ఎంను అధికారులు నియమించారు. అలాగే తెలుగు, ఇంగ్లిష్, హిందీ, పీడీ తదితర పోస్టులను అదనంగా కేటాయించారు.

హెచ్‌ఎంగా నారాయణరావు

పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా జి.నారాయణరావు నియమితులయ్యా రు. ఈయన నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామన్నారు. సమీపంలోని పీఎం పాలెం, లక్ష్మివాని పాలెం తదితర పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రమోట్ అయ్యే విద్యార్థులను ఇక్కడికి తీసుకువచ్చేందుకు, అడ్మిషన్లు పెంచేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. అడ్మిషన్ల కోసం పాఠశాల పనిదినాల్లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు తమను నేరుగా 99481 51963 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రహదారి మూసివేతతో స్థానికుల ఇక్కట్లు



సర్వీసు రోడ్డులో దుర్గాలమ్మ గుడి వద్ద అడ్డుగా వేసిన కాంక్రీట్ దిమ్మలు

పీఎం పాలెం: యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలికి వెళ్లే సర్వీసు రోడ్డుపై చంద్రంపాలెం దుర్గాలమ్మ గుడికి ఎదురుగా కాంక్రీట్ దిమ్మలు అడ్డంగా వేసి, రాకపోకలు నిలిపివేశారు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నగరం వైపు నుంచి జాతీయ రహదారిపై వచ్చే వాహనదారులు సాయిప్రియ లే అవుట్‌కు వెళ్లడానికి ఇక్కడ రోడ్డు కటింగ్ ఉంది. అలాగే సాయిప్రియాగార్డెన్స్ లే అవుట్ నివాసితులు దుర్గాలమ్మ గుడి వద్ద సర్వీసు రోడ్డుకు చేరుకుని ఆ రోడ్డులో ప్రయాణించి కారుషెడ్ కూడలి వద్ద హైవే ఎక్కి, నగరం వైపునకు ప్రయాణిస్తారు. ఈ లే అవుట్‌లో సుమారు 300 కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. అయితే, సర్వీసు రోడ్డు బంద్ చేయడంతో స్థానికులు నగరం వైపు వచ్చే జాతీయ రహదారికి చేరుకోవాలంటే రెండు, మూడు కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో వారు అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల ముందుగానే రోడ్డు బంద్ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.